
సాక్షి చిత్తూరు
శనివారం । 16 । నవంబర్ । 2024



శ్రీకాంత్‌కు అండగా వైఎస్సార్‌సీపీ
టీడీపీ నేతల దాడిలో గాయపడిన శ్రీకాంత్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎంపీ మిథున్ రెడ్డి భరోసా ఇచ్చారు. -10లో



కార్తీక పౌర్ణమి పూజలు
కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. - 10లో



పంటలపై ఏనుగుల దాడులు
పెద్దపంజాణి మండలంలో ఏనుగులు దాడి చేశాయి. చేతికొచ్చిన వరిపంటను తొక్కి నాశనం చేశాయి. - 10లో

న్యూస్‌రీల్

మాతా శిశుమరణాలను అరికట్టాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో మాతా శిశు మరణాలను అరికట్టేలా వైద్య సేవలను విస్తృతం చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె అధికారులతో సమీక్షించారు. క్యాన్సర్ స్క్రీనింగ్, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, న్యుమోనియా స్క్రీనింగ్‌ను పకడ్బందీగా చేయాలని సూచించారు. ప్రతి నోడల్ అధికారి ఈ స్క్రీనింగ్‌ను పర్యవేక్షిస్తూ, క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ శాఖ సమన్వయంతో మాతా శిశు మరణాల కట్టడికి సమష్టిగా పనిచేయాలని చెప్పారు. బాల్య వివాహాలు నియంత్రించాలన్నారు. పోషకాల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ శిరీష, ఎస్‌ఓ జార్జ్, డీఐఓ హనుమంతరావు తదితరులున్నారు.

19న సీడాప్ జాబ్ కనెక్ట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ టీటీడీసీ శిక్షణా ప్రాంగణంలో ఈ నెల 19న సీడాప్ జాబ్ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ నాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ సహకారంతో రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఇంటర్వ్యూలకు జిల్లాలోని 19 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండి ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూల్లో పాల్గొనే అభ్యర్థులకు సొంత ద్విచక్ర వాహనం, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 99635 61755, 94418 72140ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆపద్బాంధవికే ఆపద

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడుతూ ఆపద్బాంధవిగా పేరొందిన 108కే ఆపద వచ్చింది. అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. సకాలంలో జీతాలివ్వాలంటూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. విధులను బహిష్కరించి రోడ్డెక్కనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తోంది. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ భారాన్ని మోయలేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యోగ భద్రత, పని ఒత్తిడి, జీవో నెంబరు 49 అమలు తదితర సమస్యలు సుదీర్ఘ కాలంగా వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు 108 ఉద్యోగ సంఘ నాయకులు జిల్లా అధికారులకు నోటీసులు అందజేశారు.





- 108 ఉద్యోగుల సమ్మె సైరన్
- ఈ నెల 25 నుంచి ఆందోళనకు సిద్ధం
- 49 జీవోను అమలు చేయాలంటూ డిమాండ్
- జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు అందజేత

కాణిపాకం: జిల్లాలో 108 వాహనాలు 33 నడుస్తున్నాయి. ఇవి ప్రతి రోజు 15 వేల కి.మీ. తిరుగుతున్నాయి. నెలనెలా సుమారు 55 వేల మందికి 108 సేవలు అందిస్తోంది. వీరికి సేవలందించేందుకు ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు) 80 మంది, పైలెట్లు 80 మంది, ముగ్గురు సూపర్ వైజర్లు పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అత్యవసర వైద్య సేవలు అందించడంలో వీరంతా కీలకంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇప్పుడు వీరికి ఆర్థిక కష్టాలు వచ్చాయి. ఆపదలో ఆదుకునేవారు ఆకలితో అలమటించే పరిస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. మూడు నెలల జీతాలు అందక పోగా, ఉద్యోగ భద్రత లేదని 108 ఉద్యోగులు కోడై కూస్తున్నారు. ఇవి పరిష్కారం కాకపోవడంతో రాష్ట్ర ఉద్యోగుల యూనియన్ సమ్మె సైరన్ మోగించింది. ఈ మేరకు జిల్లాలోని నాయకులు కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, ఎంపీడీఓ, తహసీల్దార్లను కలిసి నోటీసులు ఇచ్చారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న ఈ సమ్మెకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేవరకు ఈ సమ్మె ఆగదని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.



డీఎంహెచ్‌ఓకి సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

సమ్మెతో అత్యవసర సేవల పరిస్థితేంటి?

108 ఉద్యోగులు సమ్మెకు ముహూర్తం ఖరారు చేశారు. దీంతో అత్యవసర సేవలకు బ్రేకులు పడనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ 15 వేల కిలోమీటర్లు తిరిగే 108 వాహనాలు వందకుపైగా అత్యవసర కేసులను ఆస్పత్రికి చేరుస్తూ, ప్రాణాలను కాపాడుతున్నాయి. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారు, గర్భిణులు, ఇతర అత్యవసర కేసులకు ఈ సేవలను అధిక సంఖ్యలో వినియోగిస్తున్నారు. అయితే ఈ సమ్మె కారణంగా వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోనున్నాయి. ఉద్యోగులంతా రోడ్డుపైకి రానున్నారు. వాహనాలు సైతం కదిలే పరిస్థితి కనిపించడం లేదు.అయితే ప్రభుత్వం ఏమేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ఇవీ డిమాండ్లు

- 108 సర్వీస్‌లోని ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీవో నెంబరు 49ను పునరుద్ధరించాలి. పైలెట్ గ్రాట్యుటీ, ఎర్న్‌డ్‌లీవు అమౌంట్ (ఆర్జిత సెలవు మొత్తం), వార్షిక ఇంక్రిమెంట్‌ను చెల్లించాలి.
- ప్రతి నెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లింపులు జరగాలి.
- 108లో కూడా షిఫ్టుల పద్ధతిని అమలు చేయాలి. 12 గంటలు పనిచేయడంతో ఒత్తిడి పెరిగి ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు 8 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.
- జీతంపై 40 శాతం ఇంక్రిమెంట్‌ను అందించాలి. అరియర్స్‌ను కలిపి వేతనంతో జమ చేయాలి.
- వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- ఈపీఎఫ్‌కు సంబంధించిన యాజమాన్య వాటా సొమ్మును యాజమాన్యమే చెల్లించే విధంగా చూడాలి. వేతన స్లాబ్‌ల్లో మార్పులు తీసుకురావాలి.
- 108 వాహనాల మరమ్మతులు సమయానికి చేయడం లేదు. దీని కారణంగా వాహనాలు కండీషన్ తప్పుతున్నాయి. వాహన మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేయాలి.
- రిలీవింగ్ బిల్లులు, ఎలక్ట్రికల్ బిల్లులు, వాహన మైనర్ మరమ్మతు బిల్లులు ఉద్యోగులకు చెల్లించాల్సినవి వెంటనే చెల్లింపులు చేయాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలి.
- అత్యవసర సేవలకు మాత్రమే 108 సేవలను వినియోగించే విధంగా చర్యలు చేపట్టాలి. సిబ్బంది కొరతను అధిగమించాలి.
- ప్రతి మండల కేంద్రంలోనూ సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలి.

పౌర్ణమి వేడుకల్లో మాజీ డిప్యూటీ సీఎం



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు (కార్వేటినగరం) : మండలంలోని పులికల్లులో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉభయదారులు గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, వైఎస్సార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, బండి కమలాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీగా రాజశేఖర్‌రాజు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: జిల్లా ఏఎస్పీగా రాజశేఖర్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను శాఖలోని అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఆయన ఎస్పీ మణికంఠ చందోలును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై చిత్తూరుకు వచ్చారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

- పకడ్బందీగా 'టీచింగ్ అట్ రైట్ లెవల్'
- విధుల్లో అలసత్వం వహించకూడదు
- శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం టీచింగ్ అట్ రైట్ లెవల్ పేరుతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. ప్రాథమిక విద్య పటిష్టంగా ఉంటేనే ఉన్నత తరగతుల్లో రాణిస్తారని చెప్పారు. ప్రతి తరగతిలో బాగా చదివే విద్యార్థులతోపాటు వెనుకబడిన విద్యార్థులు కూడా ఉంటారని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 3, 4, 5 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా బృందాలను విభజించి వారి స్థాయికి అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని సూచించారు. బోధనా అభ్యసన సామగ్రిని ఉపయోగించి బోధించాలన్నారు. అలా చేస్తే అభ్యసనా సామర్థ్యాలు పెరుగుతాయన్నారు.

అందరికీ విద్య

టీచర్లు ప్రతి విద్యార్థి స్థాయిని అర్థం చేసుకుని బోధించాలని ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ సూచించారు. ఆట పాటలతో బోధన చేస్తే విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమవుతాయన్నారు. టీచింగ్ అట్ రైట్ లెవల్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అందరికీ విద్య అందరి పాఠశాల కార్యక్రమంలో 6 నుంచి 15 ఏళ్లు కలిగిన ప్రతి ఒక్కరికీ విద్య అందించడం బాధ్యత అని పేర్కొన్నారు. ఉన్నత విద్య అందించేందుకు సమగ్రశిక్ష శాఖ సౌజన్యంతో టీచింగ్ అట్ రైట్ లెవెల్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థీ అంగన్‌వాడీ నుంచి ప్రాథమిక విద్య, ఉన్నత విద్య స్థాయికి వస్తారని చెప్పారు. వారికి ఏదో ఒక సందర్భంలో వయసుకు తగ్గ నైపుణ్యాలలో బేసిక్ లోపం ఉంటుందని చెప్పారు. ఆ లోపాలను సరిదిద్దేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొందించడం నేర్పించాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న టీచింగ్ అట్ రైట్ లెవల్ శిక్షణ టీచర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ప్రదమ్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు వినోద్ దీపక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, సెక్టోరల్ అధికారులు ఉదయలక్ష్మి, జయప్రకాష్, నరోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గించాలి

- అధికారులకు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ అంతరాయాలు తగ్గించేందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బంది కృషి చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. చిత్తూరు అర్బన్ ఈఈ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నూతన డివిజన్ పరంగా నగరం, బంగారుపాళ్యం, పైపల్లె, రెడ్డిగుంట సబ్‌డివిజన్లు వస్తాయని పేర్కొన్నారు. సెక్షన్ల వారీగా సిబ్బందిని సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రతి నెలా వందశాతం వరకు విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికాకుండా లైన్‌ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. 200 యూనిట్లపై విద్యుత్ వాడే వినియోగదారులకు పీఎం సూర్యఘర్ సోలార్ విధానం వాడే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి, పొదుపుగా వాడకం వల్ల భవిష్యత్‌లో కొరత రాదన్నారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

98 క్వాలిఫైడ్ టీచర్స్ సమావేశం రేపు

చిత్తూరు కలెక్టరేట్ : 1998 క్వాలిఫైడ్ టీచర్ల సమావేశం ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు పగడాల జనార్దనరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాలోని 98 క్వాలిఫైడ్ టీచర్లు హాజరుకావాలన్నారు. సమావేశంలో 12 నెలల జీతం, రెగ్యులరైజేషన్, రెగ్యులర్ టీచర్లకు ఉన్న సెలవులు వర్తింపజేయడం తదితర డిమాండ్లపై చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు.

గిరిజనులు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

పలమనేరు: గిరిజనులు సమాజంలో ముందుకెళ్లాలంటే చదువు చాలా ముఖ్యమని కాబట్టి పిల్లల విద్యకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా పంచాయతీ అధికారి పార్వతి సూచించారు. ఆదివాసి నాయకుడు భగవాన్ బిర్సాముండా 150వ జయంతి వేడుకలను మండలంలోని అటవీప్రాంత గ్రామమైన జగమర్లలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డీపీఓ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న గిరిజనులు విద్యపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా బాల్య వివాహాలను చేయరాదని, ఐదేళ్లు నిండిన పిల్లలను విధిగా బడికి పంపాలని సూచించారు. ముఖ్యంగా కాన్పులు ఇళ్లలో కాకుండా ఆస్పత్రుల్లో జరగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఖాదర్‌బాషా, ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ, జిల్లా ట్రైబల్ శాఖ అధికారులు, సిబ్బంది, సర్పంచ్ విజయ్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ పార్వతి

ఇదో సెమిస్టరీ

పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎంతో ఘనత ఉంది. ఆ కళాశాలకు ఉన్న ఘనతను పరిగణనలోకి తీసుకుని పీవీకేఎస్‌కు నాక్ –ఏ గ్రేడ్‌తోపాటు అటానమస్ హోదాను కల్పించారు. అయితే ఆ కళాశాలలో ప్రస్తుతం జరుగుతున్న వింత ధోరణి విమర్శలకు తావిస్తోంది. పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత కొద్ది రోజులుగా మూడవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో రెండు సబ్జెక్టులకు సంబంధించి ముందస్తుగా విద్యార్థులకు ఇచ్చిన బీఓఎస్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్) మోడల్ పేపర్‌ను యథావిధిగా సెమిస్టర్ పరీక్షల్లో ఇచ్చారు. పేరొందిన పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ తతంగం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



పీవీకేఎస్ ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల



చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే పేరొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీవీకేఎస్. అలాంటి ఘనత ఉన్న ఈ కళాశాలలో పాలన గాడి తప్పింది. ఫలితంగా పరీక్షల నిర్వహణ మిస్టరీగా మారింది. జిల్లాలోని చిత్తూరు, కుప్పం, పలమనేరు, జీడీ నెల్లూరు పలు ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులు ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. పీవీకేఎస్ కళాశాలలో తమ పిల్లలను చదివిస్తే ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని తల్లిదండ్రులకు బలమైన నమ్మకం. అయితే అక్కడ జరుగుతున్న తతంగం చూస్తే కళాశాల కీర్తి ప్రతిష్టను దెబ్బతీసేలా ఉంది.



బీకాం విద్యార్థులకు ప్రిపరేషన్‌కు ముందస్తుగా ఇచ్చిన ఈ కామర్స్, వెబ్‌డిజైన్ బీఓఎస్ మోడల్ పేపర్

మోడల్ పేపరే ప్రశ్నపత్రంగా..

గత కొద్ది రోజులుగా పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో రెండు సబ్జెక్టులకు సంబంధించి ముందస్తుగా ఇచ్చిన మోడల్ పేపర్‌నే మళ్లీ ప్రశ్నపత్రంగా విద్యార్థులకు అందజేసి పరీక్షలు రాయించారు. ఇలాంటి వింత ధోరణి రాష్ట్రంలోని ఏ అటానమస్ కళాశాలలోనూ ఉండదేమోనని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అటానమస్ నియమ, నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి ముందస్తుగా బీఓఎస్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్) మోడల్ పేపర్లను అందజేస్తారు. విద్యార్థుల ప్రిపరేషన్‌ను దృష్టిలో పెట్టుకుని అవగాహన నిమిత్తం మాత్రమే మోడల్ పేపర్లను ఇస్తారు. అయితే పీవీకేఎస్ కళాశాలలో ముందస్తుగా ఇచ్చిన మోడల్ పేపర్లనే సెమిస్టర్ పరీక్షల్లో ప్రశ్నపత్రాలుగా విద్యార్థులకు ఇచ్చి పరీక్షలు రాయించారు. ఈ పరీక్షలు రెండూ ఈ నెల 11వ తేదీ నిర్వహించడం గమనార్హం. రెండో సంవత్సరం బీకాంకు సంబంధించి ఈ కామర్స్, వెబ్ డిజైనింగ్ ప్రశ్నపత్రం 75 మార్కులకు, రెండవ సంవత్సరం బీఎస్సీకి సంబంధించి ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ యూజింగ్ జావా (టైటిల్ ఆఫ్ ది కోర్స్) 75 మార్కులు ఇలా రెండు సబ్జెక్టుల ప్రశ్నపత్రాలు మోడల్ పేపర్‌నే అందజేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో మిగిలిన పరీక్షల నిర్వహణ కూడా అనుమానాలకు తావిస్తోంది. పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ హోదా అధికారి ఉంటారు. ఆ కళాశాలలో ఆ హోదాలో విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర అలసత్వం వల్ల ఈ తప్పిదం చోటు చేసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్షల నిర్వహణే ఇలా సాగుతుంటే మిగతా పాలన ఇంకెలా ఉంటుందో అన్న సందేహం వ్యక్తమవుతోంది.

నియమ, నిబంధనలు తూచ్



ప్రస్తుత సెమిస్టర్ పరీక్షలో విద్యార్థులకు ఇచ్చిన ఈ కామర్స్, వెబ్‌డిజైన్ ప్రశ్నపత్రం

పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలను అటానమస్ (స్వయం ప్రతిపత్తి)నియమ, నిబంధనలను అనుసరించి పకడ్బందీగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలకు ప్రశ్నపత్రాలను తయారు చేసేటప్పుడు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించే ప్రశ్నపత్రాలను గోప్యంగా ఉంచాల్సి ఉంటుంది. అలా ఆయా సబ్జెక్టుల నిపుణులు రూపకల్పన చేసే ప్రశ్నపత్రాలను బయట ప్రాంతంలో ముద్రణకు పంపుతారు. ముద్రణ పూర్తయిన తర్వాత భద్రత పీవీకేఎస్ కళాశాలలో చదివే విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే కళాశాలలో పరీక్షల నిర్వహణలో నియమ, నిబంధనలు ఏ మాత్రం పాటించడం లేదు.

ప్రశ్నపత్రాలు బయట నుంచి వస్తాయ్



సెమిస్టర్ పరీక్షల ప్రశ్నపత్రాలు మా కళాశాలలో రూపొందించం. అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రాలు బయట ప్రాంతం నుంచే వస్తాయి. పరీక్షలు అటానమస్ నియమ, నిబంధనలకు లోబడే పకడ్బందీగా నిర్వహిస్తాం. బీఓఎస్ మోడల్ పేపర్ ప్రకారం ప్రశ్నపత్రం వచ్చే అవకాశం ఉండదు. అలా జరగడానికి ఏ మాత్రం అవకాశం ఉండదు. కాకపోతే ఏమైనా తప్పిదం జరిగి ఉండొచ్చేమో విచారణ చేస్తాను.

– డా.జీవనజ్యోతి, ప్రిన్సిపల్, పీవీకేఎస్ ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల

క్లుప్తంగా

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీభాషా తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ శిక్షణ పొందేందుకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 20 వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో చిత్తూరులో శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణకు టీటీసీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

జిల్లా వ్యాప్తంగా సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. అయన మాట్లాడుతూ యూపీపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్‌కు అర్హత ఉన్న జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపికయ్యే అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారని తెలిపారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఇతర వివరాలకు శ్రీనివాసులు 85200 04646, ప్రేమ్ 91774 29494ను సంప్రదించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ ఉచిత మోడల్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా డిసెంబర్ 1వ తేదీన మోడల్ ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్) పరీక్ష నిర్వహించనున్నట్లు స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరోత్తమ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమ సంఘం ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా ఉచితంగా ఎన్ఎంఎంఎస్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ పరీక్ష డిసెంబర్ 1వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ నెల 18 వ తేదీ లోపు పరీక్షలు రాసే విద్యార్థుల పేర్లను తెలియజేయాలన్నారు. ఇతర వివరాలకు 94407 11784ను సంప్రదించాలని కోరారు.

● కార్తీక పున్నమి.. శివకేశవుల స్మరామి



తిరుమలలో గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

హరిహరులకు ప్రీతికరం.. కార్తీక మాసం.. ఆపై పున్నమి.. ఇంకేముంది ప్రతి గుండెలో భక్తి పారవశ్యం ప్రతిధ్వనించింది. శివకేశవుల స్మరణ మిన్నంటింది. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి గరుడుడిపై విహరించి.. భక్తులను కటాక్షించగా.. వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తిలో జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటికి వేదోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు.

- తిరుమల/శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి ఆలయంలో శివపార్వతుల ఊంజల సేవ (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తుల ఊరేగింపు

కొత్త బండి.. ఆగిపోతోందండి!

- బీఎస్–6 వాహనాలే అధికం
- కొత్తరకం వాహనాలకు సెన్సార్..
- టెక్నాలజీకి తగ్గట్టు అందని మరమ్మతు సేవలు
- ఎన్నిసార్లు బాగుచేసినా, మళ్లీ అదే సమస్యలు



కాణిపాకం: ప్రస్తుత రోజుల్లో ఒక చేతిలో ఫోన్.. మరో చేతిలో బండి ఉంటేనే పనులు జరుగుతుంటాయి. ఏ చిన్న పనికి అయినా ఇవి రెండు కళ్లుగా పనిచేస్తాయి. అలాంటిది ఏ ఒక్కదానికి సమస్య వచ్చిన మనిషికి చేతులు...కాళ్లు ఆడవు. ప్రధానంగా ద్విచక్ర వాహనం లేనిదే ఇంటా..బయట పనులు జరగడు. బండికి చిన్న ట్రబుల్ ఇచ్చిన తంటాలుపడిపోతుంటారు. జిల్లాలో 70 వరకు అన్ని రకాల వాహనాల షోరూంలున్నాయి. వీటి నుంచి ప్రతి నెలా వందల సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కుతుంటాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 5.5 లక్షల ద్విచక్ర వాహనాలు, 3 లక్షల వరకు కార్లు ఉన్నాయని రవాణా శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇందులో బీఎస్–6 రకం వాహనాలు సుమారు 2 లక్షల వరకు ఉండవచ్చని అధికారుల అంచనా. ఈ వాహనాలకు కాలుష్య రహితంతోపాటు సెన్సార్ సిస్టంను అమర్చారు. ఈ విధానం ద్వారా బండిలోని లోటుపాట్లను సులభంగా గుర్తించి మరమ్మతులు చేయించుకోవచ్చు. అయితే అందుకు తగ్గట్టు కొన్ని సర్వీసు సెంటర్లలో దారుణంగా వ్యవహరిస్తున్నారు. బండి సర్వీసుకు ఇచ్చినా సంతృప్తిని ఇవ్వడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రధానంగా బీఎస్–6 ద్విచక్ర వాహనాలకు ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు, మెకానిక్స్ చెబుతున్నారు.

సర్వీసుల్లో తృప్తి ఏదీ?

షోరూంల సిబ్బంది కొందరు వాహనాలను సరిగ్గా సర్వీస్ చేయడంలేదు. ఏదో తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం. ప్రధానంగా బీఎస్–6 వాహనాలకు సర్వీసు సెంటర్లలో పూర్తి స్థాయిలో విడిభాగాలు దొరకడం లేదు. ఇక సర్వీసు విషయానికి వస్తే.. టెక్నాలజీకి తగ్గటు అక్కడ వ్యవస్థ (సిస్టం) లేదని వాహనదారులు చెబుతున్నారు. బీఎస్–6 వాహనాలను సిస్టంకు కనెక్ట్ చేసి అందులో ఏ భాగం మరమ్మతుకు గురైందో వెంటనే చెప్పే టెక్నాలజీ ఉంది. కానీ ఆ రకంగా జిల్లాలో చాలా చోట్ల సర్వీసు సెంటర్‌లు సిస్టం ఏర్పాటు చేయడం లేదు. సర్వీసుకు వెళ్లినప్పుడల్లా పరికరాలు, సర్వీసు చార్జీల బాదుడు మాత్రం అధికంగా ఉంటోంది. దీనిపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ■ చిత్తూరు నగరానికి చెందిన శిరీష 2022లో బీఎస్–6 రకం వాహనాన్ని కొనుగోలు చేసింది. ఈ వాహనం ఏడాది పాటు సవ్యంగా నడిచింది.ఆ తర్వాత స్టార్టింగ్ ట్రబుల్ మొదలైంది. సర్వీసు సెంటర్‌లో బండి ట్ర బుల్ ఇస్తోందని గుచ్చి గుచ్చి అక్కడి సిబ్బందికి చెప్పింది. ఆ సరిచేశాములే అంటూ వా రు బండిని అప్పగించారు. అయినా ప్రతి సర్వీసుకు మళ్లీ అదే సమస్య తలెత్తడంతో కస్టమర్ సెంటర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత కొన్ని పరికరాలు మార్చినా మళ్లీ ట్రబుల్ ఇస్తోంది. బండి రన్నింగ్‌లోనే ఆగిపోతోంది. తీరా విచారిస్తే బీఎస్–6 స్థాయికి తగ్గట్టు సేవలందించే వ్యవస్థ లేదని తెలిసింది.
- ■ చైతన్యకి చెందిన టూవీలర్ కూడా సెల్ఫ్ స్టార్ట్ కొన్ని సార్లు పనిచేయడం లేదు. బండి రన్నింగ్‌లో కూడా మధ్యలో ఆగిపోతోంది. బయట మెకానిక్స్ చూసి బీఎస్–6 షోరూం సర్వీస్ సెంటర్‌కు వెళ్లాల్సిందేనని చెప్పారు. సర్వీస్ సెంటర్‌కు వెళితే అక్కడ టూల్‌కిట్ లేదని తిప్పి పంపించారు. కిట్ వచ్చిందనే కాల్ చేస్తామని పంపించేశారు. ఇలా ఈ రెండు వాహనాలు కాదు.. చాలా వాహనాలు రన్నింగ్‌లోనే మొరాయిస్తున్నాయి. ఎందుకో ఆగిపోతున్నాయో షోరూమ్ సిబ్బందికీ తెలియకపోవడం గమనార్హం.

ఇటీవల కాలంలో కొత్త టెక్నాలజీ, మోడల్స్‌తో వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. అందులోనూ కాలుష్య నివారణ దిశగా కంపెనీలు, ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకు టెక్నాలజీని జోడిస్తోంది. కొత్త రకంతో ప్రస్తుతం బీఎస్–6 వాహనాలు అధికంగా తిరుగుతున్నాయి. అయితే టెక్నాలజీకి తగ్గట్టు వాటికి సేవలు లేకపోవడంతో వాహనదారులు టెన్షన్ పడిపోతున్నారు. మరమ్మతులు చేసినా మళ్లీ అదే సమస్యలు తలెత్తడంతో తలలు పట్టుకుంటున్నారు.

అంతా బీఎస్–6 మహిమ

బీఎస్–6 వాహనాల రిపేర్లను పూర్తి స్థాయిలో అందరూ మెకానికల్స్ చేయలేరు. కొన్ని విడిభాగాలను మార్చగలరు. ఇతరత్రా వాటిని చాకచక్యంగానే రిపేర్ చేయగలరు. ప్రధానంగా బీఎస్–6 ఇంజిన్‌లోపం ఉంటే దాన్ని మాత్రం ముట్టుకోరు. ఒక వేళ ముట్టుకున్నా వాటిని రిపేర్ చేసే సమయంలో తికమకపడుతుంటారు. ఒక విడిభాగాన్ని మార్చాలంటే గంటల కొద్దీ సమయం తీసుకుంటారు. అదే ఆయా సర్వీసు సెంటర్లకు వెళితే విడిభాగాలను సులభంగా మార్చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న స్టార్టింగ్ ట్రబుల్ సమస్య పరిష్కారంలో మాత్రం విఫలమవుతున్నారు. ఈ వాహనాల్లో చాలా వరకు స్టార్టింగ్ సమస్యలు వస్తున్నాయి. నిత్యం నడుపుతున్న బండి ఒక్కసారిగా ఆగిపోతే కిక్కర్ తొక్కి తొక్కి అలసిపోతున్నారు. స్టార్ట్ అయి బండి రోడ్డుపై వెళుతున్న సమయంలో ఆకస్మాత్తుగా ఆగిపోతే గుండె ఝల్లుమంటోంది. చాలా మంది వాహనాలను విధి లేని పరిస్థితుల్లో నడుపుతున్నారు. వాహనాలను సర్వీసులకు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. మళ్లీ అదే ట్రబుల్ ఇస్తోంది. సర్వీసు సెంటర్‌కు వెళితే పదే పదే బుడ్డ కాయల్, మాగ్నెట్ పోయిందని, ఆర్డర్ పెట్టుకుంటే స్పేర్ వచ్చేందుకు 10 రోజులు పడుతోందని సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో చాలా మంది రోజువారీ పనులను వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి వస్తోంది.

> **తనిఖీలు చేస్తాం**
>
> కాలుష్య నివారణలో భాగంగానే కొత్తరకం వాహనాలు మార్కెట్లోకి విడుదలవుతున్నాయి. పెరిగిన టెక్నాలజీకి తగ్గట్టు బండ్లు ఉన్నాయి. వాటిని టెక్నాలజీ ఉపయోగించి రిపేర్ చేసేలా సెట్ చేశారు. అందుకు తగట్టు సిస్టంలు సర్వీసు సెంటర్లో ఉన్నాయా.. లేదా తనిఖీలు చేస్తాం. దీనిపై షోరూం నిర్వాహకులకు వివరిస్తాం. వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటాం.
>
> -నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం నెల్లూరుకు చెందిన రజనీకాంత్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. అధికారులు దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం అల్పిసి (కార్తీక) పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకుజామున మూలవిరాట్‌కు అన్నాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం వరకు అర్జిత సేవలను రద్దు చేశారు. అలాగే అనుబంధ మరగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి, పెరిందేవి సమేత వరదరాజస్వామి ఆలయాల్లోనూ వేకువజాము నుంచి రాత్రి వరకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కేదార గౌరీ వ్రతాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

కెనరాబ్యాంక్ సేవలు మరింత విస్తృతం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణరాజు

తిరుపతి కల్చరల్: కెనరా బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయనున్నట్లు ఆ బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణరాజు తెలిపారు. ఆర్సీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంక్ నూతన పద్ధతులను పాటించి, మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు తిరుపతిలో బ్యాంకులకు సంబంధించిన రీజినల్ కార్యాలయాలు మాత్రమే ఉన్నాయని, సర్కిల్ ఆఫీసును ఒక కెనరా బ్యాంక్ మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఏఐ టెక్నాలజీ వినియోగించి ఏఐ1 యాప్‌ను కెనరా బ్యాంక్ రూపొందించిందన్నారు. దేశంలోని పబ్లిక్ సెక్టార్ బ్యాంకులన్నింటిలో తమ బ్యాంకు రూపొందించిన ఏఐ1యాప్‌కు 2.62 కోట్ల మంది యూజర్స్ ఉన్నారని తెలిపారు. 11 భాషల్లో ఏఐ1 యాప్ పని చేస్తోందని తెలిపారు. బ్రాంచ్ జీఎం పాండు రంగ మితంత్య, బ్రాంచి జీడబ్ల్యూ జీఎం రామనాయక్, కేంద్ర కార్యాలయం జీఎం రవికృష్ణ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్యప్రకాష్ సింగ్, పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గత కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచాయతీ ఆకులవారిపల్లి, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లి, జిట్టంవారిపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం రాత్రి పలమనేరు ఫారెస్టు రేంజ్ కీలపట్ల బీటు నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పంటలను ధ్వంసం చేశాయి. చంద్రప్ప, సురేంద్ర తదితరుల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బాధిత రైతులు మాట్లాడుతూ చేతికొచ్చిన పంటను ఏనుగుల వల్ల నష్టపోతున్నామని కన్నీరుమున్నీరయ్యారు. భారీగా పంట నష్టం జరిగినా అధికారులు మాత్రం నామమాత్రంగా పరిహారం చెల్లిస్తున్నారని వాపోయారు. గజ దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తెల్లదొరలతో పోరాడిన ధీరుడు బిర్సా



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : బ్రిటీష్ పాలకులతో పోరాడిన ధీరుడు, గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా అని డీఆర్‌ఓ మోహన్ కుమార్ అన్నారు. సంజయ్‌గాంధీ నగర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం జన జాతీయ గౌరవ్ దివస్ (గిరిజన స్వాభిమాన ఉత్సవాలు) కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన డీఆర్‌ఓ మాట్లాడుతూ గిరిజన తెగకు చెందిన భగవాన్ బిర్సా తనకు ఉన్న జ్ఞానంతో బ్రిటీష్ పాలకులను ఎదిరించారని చెప్పారు. ఆయనను గిరిజనులు స్ఫూర్తిగా తీసుకుని విద్యలో రాణించాలన్నారు. ప్రస్తుత కాలంలో పుస్తకాలకు సంబంధించిన విజ్ఞానం కొరవడుతోందన్నారు. విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్‌లో బంధీ అయిపోతున్నారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను నేటి విద్యార్థులు చదివి చైతన్యం పెంచుకోవాలని సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి మాట్లాడుతూ భగవాన్ బిర్సా 25 ఏళ్ల వయసులోనే తరతరాలకు స్ఫూర్తి కలిగించి చరిత్రలో నిలిచారన్నారు. గిరిజన జాతిలో చైతన్యం తీసుకొచ్చిన ఆయన 150వ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని ప్రతి గిరిజనుడు ఖచ్చితంగా ఆధార్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి గిరిజనుడికి ఆధార్‌కార్డు ఉండేలా కలెక్టర్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్‌కార్డులతో పాటు ఆరోగ్య పరీక్షలను చేయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రేఖ, ఎన్‌జీవో సంస్థల అధినేతలు రామాచారి, ధనశేఖర్, వేల్కూరు రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు అండగా వైఎస్సార్‌సీపీ



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పూతలపట్టు: కూటమి నాయకుల దాడిలో గాయపడిన పూతలపట్టు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డికి పార్టీ అండగా ఉంటుందని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం చిత్తూరు కట్టమంచిలోని అద్దె ఇంటిలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించారు. ఇలాంటి దాడులకు భయపడాల్సిన అవసరం లేదని, అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. దాడులకు, అక్రమ కేసులకు భయపడవద్దని, తమకు కొండంత అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలను టీడీపీ నాయకులు టార్గెట్ చేస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పార్టీ కోసం కష్టపడేవారిపై దాడులు చేస్తోందని దుయ్యబట్టారు.

చంద్రబాబుక పరిపాలన చేతగాక దాడులు చేస్తున్నట్లు వాపోయారు. మండలానికి చెందిన ముఖ్యమైన నాయకుడిపై దాడిచేస్తే మిగిలిన కార్యకర్తలు భయపడతారనే భ్రమలో టీడీపీ నాయకులు ఉన్నారని చెప్పారు. వారు చేసిన అక్రమాలకు సమాధానం చెప్పే రోజు త్వరలోనే వస్తుందని, ఆ రోజు ఎవరినీ వదిలేది లేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పోస్టులు పెడితే వారిపై దాడి చేసి, అక్రమ కేసు పెట్టే ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. ఈ ఐదు నెలల్లో ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రజలు కూటమి ప్రభుత్వం రాకతో చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, పాలఏకరి చైర్మన్ కుమార్‌రాజా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, పట్నం ప్రతాప్‌రెడ్డి, పాలేరు రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ హరిణిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పూతలపట్టు ఎస్సీ సెల్ అధ్యక్షులు కోదండరామ, మురళి, షణ్ముగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు డీఎస్పీని కలిసిన ఎంపీ మిథున్ రెడ్డి

పలమనేరు: పుంగనూరు అల్లర్ల కేసుకు సంబంధించి రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి శుక్రవారం పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అక్కడి పోలీసులు పెట్టిన కేసులకు సంబంధించి హైకోర్టు వీరికి కండీషన్ బెయిల్ మంజూరు చేసింది. ఇందులో భాగంగా స్థానిక డీఎస్పీ డేగల ప్రభాకర్ ఈ కేసుకు ఐవోగా ఉన్నందున ఎంపీ ఇక్కడికి న్యాయవాదులతో వచ్చి నిబంధనల మేరకు డీఎస్పీని కలిసి వెళ్లారు. ఆయనకు పలమనేరు, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, డా.సునీల్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నియోజకవర్గ నేతలు స్వాగతం పలికారు.



పలమనేరు డీఎస్పీని కలిసి వస్తున్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, నాయకులు